# క్రీడా ప్రాంగణాలు దేశానికే ఆదర్శం

- 18వేల పల్లెల్లో మైదానాలు ఏర్పాటు: ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- క్రీడలకు సర్కారు సముచిత స్థానం: ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

హన్వాడ, అక్టోబర్ 3 : దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రీడా ప్రాంగణాలను తెలంగాణలో 25వేల గ్రామాల్లో ఏర్పాటు చేసి, కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నామని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర వ్యాప్త కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18వేల క్రీడా మైదానాలను పూర్తి చేశామని, రూ.50వేల క్రీడా సామగ్రిని కిట్ రూపంలో అందిస్తున్నామన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసేందుకే సీఎం కేసీఆర్ క్రీడా మైదనాలను ఏర్పాటు చేశారని వివరించారు. మండలంలో 35 కిట్లు, జిల్లావ్యాప్తం గా మొత్తం 360 కిట్లను పంపిణీ చేస్తున్నామని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశంలోనే అతి పెద్ద ఎకో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేసుకున్నామని, ప్రతి రోజూ వందలాది మంది పర్యాటకులు వస్తున్నారన్నారు. పీఆర్ఎల్ఐ ప్రాజెక్టుతో తాగు, సాగునీటికి ఢోకా ఉండదన్నారు. హరితహారం కింద 4కోట్ల 35వేల మొక్కలు నాటామని తెలిపారు. క్రీడలకు సర్కారు సముచితస్థానం కల్పిస్తున్నదని, క్రీడాకారులు సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. క్రీడాకారులు రాణించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాలమూరును సస్యశ్యామలం చేయడంలో మంత్రి కృషి ఎంతో ఉన్నదన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను చూస్తుంటే సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో క్రీడా శాఖ చైర్మన్ ఆంజనేయగౌడ్, డైరెక్టర్ లక్ష్మి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, ఎంపీపీ బాలరాజు, డీఆర్‌డీఏ పీడీ యాదయ్య, జెడ్పీటీసీ విజయనిర్మల, ఎంపీడీవో ధనుంజయగౌడ్, తాసీల్దార్ కిష్టానాయక్, సర్పంచ్ రేవతి, ఎంపీటీసీ సత్యమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌కు దీటుగా పాలమూరు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 3 : మహబూబ్‌నగర్ పట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఆబ్కారీ, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణ ప్రజలు తాగునీరు, కరెంటు, వార్డులో అంతర్గత రోడ్లు లేక నానా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మిషన్ భగీరథ ద్వారా నిరంతరం తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. 70 ఏండ్లల్లో జరుగని అభివృద్ధి తొమ్మిదేండ్లలో పూర్తి చేశామన్నారు. పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, కౌన్సిలర్లు శ్రీలత, కిశోర్, ప్రవీణ్, రోజా, ఉమర్, సంధ్య, మోతీలాల్, అంజయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోలేరు

- ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 3 : ఎన్ని కుట్రలు పన్నినా అభివృద్ధిని అడ్డుకోలేరని మంత్రి తెలిపారు. గతంలో తనపై ఎన్నో ఆరోపణలు చేశారని, అయినా అభివృద్ధిని చూసి ప్రజలు రెండోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించారని గుర్తుచేశారు. మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరవగా నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తులకు సీఎం కేసీఆర్ పూర్వవైభవం తీసుకొచ్చారన్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలనే ఇక్కడి నుంచి పోటీ చేశానన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పండుగ సాయన్న వివరాలు తెలుసుకొని సమాధిని గుర్తించి పాలరాతితో అద్భుతంగా నిర్మించామన్నారు. హైదరాబాద్‌లో రూ.3కోట్లతో ముదిరాజుల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు. అంతకుముందు పట్టణంలోని శ్రీనివాస్‌కాలనీలో రూ.3 కోట్లతో నిర్మించనున్న ముదిరాజుల భవన నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. అక్కడి నుంచి జేజేఆర్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిశోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్, ఆర్గనైజర్ సెక్రటరీ రామకృష్ణ, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, హన్వాడ ఎంపీపీ బాలరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త అధ్యాయం ప్రారంభం

- రాష్ట్రవ్యాప్తంగా 12 చోట్ల పామాయిల్ ఫ్యాక్టరీలు
- రేపటి తరానికి కులాలు తాత్కాలికం
- మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు ముదిరాజులు సహకరించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


ఖిల్లాఘణపురం: మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి


ఇటిక్యాల: పామాయిల్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఇటిక్యాల, అక్టోబర్ 3 : వెనుకబడిన ప్రాంతంలో ప్రతిష్టాత్మక ఫ్యాక్టరీ ఏర్పాటుతో కొత్త అధ్యాయం ప్రారంభమైందని వ్యవసాయ, ఉద్యానవనశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విజయవర్దనే ఆయిల్ మిల్ ప్రాంగణంలో రూ.200కోట్లతో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులకు మంత్రి భూమిపూజ చేసి మాట్లాడారు. గతంలో ఇక్కడ వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలు పండుతాయనే భావనతో 2003లో 95 ఎకరాల్లో ఆయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారన్నారు. కానీ ఆంధ్రాపాలకుల దౌర్జన్యానికి అనతి కాలంలోనే మూతపడిందని గుర్తు చేశారు. ఈ ఫ్యాక్టరీని ఆంధ్రాపాలకులు అమ్మకానికి పెడితే తాము ఉద్యమం చేస్తే వారు తలొగ్గి వాయిదా వేశారని వివరించారు. స్వరాష్ట్రంలో ఫ్యాక్టరీ వారు ఎన్‌డీడీబీ వారికి అప్పుగా ఉన్న రూ.36కోట్ల బకాయిని వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ప్రభుత్వం రూ.8.42కోట్లు చెల్లించిందన్నారు. వంటనూనెల అవసరాల్లో స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో లాభదాయకమైన ఆయిల్‌పాం పంట సాగుకు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ పంట సాగులో రైతులకు ఇబ్బందులు ఉండవని, ప్రస్తుతం ఈ పంట సాగులో మనం దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నామన్నారు. మన రాష్ట్రంలోని భూమి బంగారమని, దీని నుంచి వచ్చే ఉత్పత్తులే కీలకమన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ సేవలను ఆయన గుర్తు చేశారు. వేద్దాం వేద్దాం.. ఆయిల్ పాం పంట వేద్దాం అని రైతులను మంత్రి ప్రోత్సహించారు. ఈ ఫ్యాక్టరీలో గంటకు 30 టన్నుల పామాయిల్ గెలలను క్రష్ చేయవచ్చని, సాగు విస్తీర్ణం పెరిగే కొద్దీ క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 400మందికి, పరోక్షంగా 1,400మందికి ఉపాధి లభిస్తుందన్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల రైతులు ఈ ఫ్యాక్టరీ పరిధిలోకి వస్తారన్నారు. రాష్ట్రంలోని 12 చోట్ల పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తాను వనపర్తి జిల్లా అభివృద్ధికే కృషి చేస్తానని, వేరే ప్రాంతాలను పట్టించుకోరనే అపవాదు తగదన్నారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉద్యానవనశాఖ అదనపు కమిషనర్ సరోజిని, అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్, గద్వాల మార్కెట్‌యార్డ్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ హన్మంత్‌రెడ్డి, అయిజ మున్సిపల్ చైర్మన్ దేవన్న, ఆయిల్ మిల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### మానవ సంబంధాలే శాశ్వతం

వనపర్తి, అక్టోబర్ 3 : సాగునీటి రాకతో పాలమూరు దశ, దిశ మారనున్నదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. నేటి సమాజంలో ముదిరాజ్, మత్స్యకారులు కులవృత్తితోపాటు విద్యలో రాణించాలని సూచించారు. మంగళవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌తో కలిసి మంత్రి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ మొదటగా ముదిరాజుల సంక్షేమం కోసం చెరువుల్లో ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. రేపటి తరానికి కులాలు తాత్కాలికమని, మానవ సంబంధాలే శాశ్వతమని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో 25వేల మందితో జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు. రూ.2కోట్లతో మత్స్యకారుల భవనానికి గురువారం శంకుస్థాపన చేస్తామన్నారు. ముదిరాజులను బీసీ-ఏలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటుకు ముదిరాజులు సహకరించాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చాక ముదిరాజ్, మత్స్యకారులను పట్టించుకున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ తెలిపారు. మత్స్యకార కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల బీమా వర్తించేలా సీఎం కేసీఆర్ చేశారన్నారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి రూ.90లక్షలతో చేపట్టిన బాలసదన్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యకమంలో మంత్రి సతీమణి వాసంతి, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మత్స్యకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా సభ్యులు సత్యనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు తదితరులున్నారు.

### అన్నిరంగాల్లో ప్రతిభ కనబర్చాలి

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 3 : విద్యార్థులు క్రీడలతోపాటు అన్నిరంగాల్లో ప్రతిభ కనబర్చి ఉన్నతంగా రాణించాలని మంత్రి అన్నారు. మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఎంపీపీ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఖోఖో పోటీలను మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి పల్లెలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. శుక్రవారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నటరాజు అధ్యక్షతన జీపీ సిబ్బంది, ఆశా వర్కర్లకు దుప్పట్లు, ఆరోగ్య కిట్లను అందజేశారు. మంత్రి జన్మదినం సందర్భంగా పంపిణీ చేసినట్లు నటరాజు తెలిపారు.

అదేవిధంగా సోలీపూర్, ఖిల్లాఘణపురం, మామిడిమాడ, మానాజీపేటలోని క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచ్ వెంకటరమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సకల సౌలత్‌లతో గ్రామ సచివాలయాలు

- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి
- లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్స్, ఇండ్ల పట్టాల పంపిణీ


చౌదర్‌పల్లిలో గృహలక్ష్మి ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర, అక్టోబర్ 3 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సకల సౌలత్‌లతో గ్రామ సచివాలయాలను నిర్మిస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కనీవినీ ఎరుగనిరీతిలో పల్లెలను ప్రగతిలో ముందుంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం చౌదర్‌పల్లి, బల్సుపల్లి, అజిల్లాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు భాజాభజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. జీపీ భవనాలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నామన్నారు. జీనుగురాలలో వేసవి వస్తే తాగునీటికి సమస్య తలెత్తేదని, నేడు మిషన్ భగీరథతో ఇంటి వద్దకే శుద్ధజలం వచ్చిందన్నారు. రూ.20లక్షలతో నూతన హంగులతో గ్రామ పంచాయతీ భవనాలను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు ఓట్ల కోసం ఊళ్లోకి వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలని చెప్పారు. కరివెన ప్రాజెక్టుతో నియోజకవర్గంలోని బీడు భూములకు సాగునీరు అందిస్తామన్నారు. ఆయా జీపీ భవనాల వద్ద ఎమ్మెల్యే మొక్కలు నాటి 19మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు, ముగ్గురికి ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా లక్ష్మీపల్లిలో 20 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు, 199మందికి ఇండ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ కురుమూర్తి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, సర్పంచులు యుగేంధర్‌రెడ్డి, సరోజ, విశ్వనాథ్, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, స్వామి, బుచ్చిరెడ్డి, స్వామి, భాస్కర్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.